కార్మిక శాఖ మంత్రికి సత్కారం



నాంపల్లి: ఇటీవల నూతనంగా కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు వివేక్ వెంకటస్వామికి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గురువారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో నిర్వహించారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నల్లబాబు అధ్యక్షతన మంత్రి వివేక్ వెంకటస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దండు లక్ష్మణ్, భాస్కర్, మహ్మద్ ఖాజా, హసన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో జడ్‌సీ వెంకన్న

చాంద్రాయణగుట్ట: వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. ఫారూక్‌నగర్‌లో దోమల నివారణపై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇళ్లల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించడం ద్వారా దోమలను లార్వా దశలోనే నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ అరుణ కుమారి, ఏఎంఓహెచ్ అనురాధ, సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఏఈ సతీష్ రెడ్డి, ఈఎఫ్ఏ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు సేవలు ఎంతో విలువైనవి



నాగరాజు దంపతులను సత్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ క్షేత్ర అధికారి ఆర్.నాగరాజు పదవీ విరమణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. భాషా, సంస్కృతుల పరిరక్షణకు గత కొన్ని సంవత్సరాలుగా నాగరాజు చేసిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. అనంతరం ఆర్.నాగరాజు దంపతులను రవీంద్రభారతి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధికారులు సీహెచ్.రఘునందన్, హేమలతా రెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాక్సింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



బాక్సింగ్‌లో తలపడుతున్న అమ్మాయిలు

గోల్కొండ: బాక్సింగ్‌లో రాణించాలంటే దేహదారుఢ్యం తప్పనిసరి అని ప్రముఖ బాక్సింగ్ కోచ్ ఏజాజ్ అహ్మద్ చాంద్ అన్నారు. గోల్కొండలో ఆయన ఆధ్వర్యంలో రేతిగల్లిలోని బాక్సింగ్ క్లబ్‌లో అమ్మాయిల బాక్సింగ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాక్సింగ్‌కు ఆదరణ పెరుగుతుందన్నారు. గత దశాబ్ద కాలం నుంచి తెలంగాణ నుంచి ఎందరో బాక్సర్లు జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా దేశ ప్రతిష్టను చాటిచెప్పారన్నారు. ఉసాముద్దీన్, నిఖత్‌జరీన్ లాంటి వారు నేటి యువ బాక్సర్లకు ఆదర్శమన్నారు.

పాతబస్తీలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి



దాసోజు శ్రవణ్‌ను కలిసిన తిరుపతి నర్సింగ్ రావు

చార్మినార్: పాతబస్తీలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయడానికి పార్టీ అధిష్టానం దృష్టి సారించాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌ను కలిసి కోరినట్లు లాల్ దర్వాజా సింహవాహిని ఆలయ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తిరుపతి నర్సింగ్ రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పాతబస్తీలో పార్టీ అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే డివిజన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పాతబస్తీలో పార్టీ సీనియర్ నాయకులతోపాటు కార్యకర్తలతో సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గ్రంథాలయాన్ని మూసేస్తారా..?

- 63 ఏళ్లుగా ప్రజల్లో వెలుగు నింపిన గ్రంథాలయం
- ఎంతో మంది ఇక్కడ చదివే ఉన్నత స్థాయికి ఎదిగారు
- బాపు జయంతి, వర్ధంతిలు నిర్వహించింది ఇక్కడే..
- ఆర్మీ ప్రాంతమని తమకు అప్పజెప్పాలంటూ అనుమతులు నిరాకరణ
- శిథిలావస్థకు చేరడంతో పూర్తిగా మూసివేసే దిశగా అడుగులు



గ్రంథాలయంలో సమావేశమైన మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులు

లంగర్‌హౌస్: టెక్నాలజీ పెరిగిన నేటి డిజిటల్ సమాజంలో కూడా గ్రంథాలయాలకు ఆదరణ తగ్గలేదు. గతంలో సమాచారం రోజు వారి వార్తలు ప్రపంచ విషయాలు తెలుసుకోవాలన్నా, కొత్త విషయాలు నేర్చుకోవాలన్నా గ్రంథాలయాలు ఎంతో దోహదపడేవి. ఎంతగా అంటే పాఠ్యపుస్తకాలు కొనే స్థోమత లేని వారు కూడా ఇక్కడ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదివి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరేవారు. అందరు ఇక్కడ చేరి అన్ని విషయాలు చర్చించుకునే వారు. ఇలాంటి గ్రంథాలయాల్లో ఒకటయిన లంగర్‌హౌస్ బీఎల్ గ్రంథాలయాన్ని మూసివేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.



గ్రంథాలయం

63 ఏళ్ల చరిత్ర..

లంగర్‌హౌస్ ప్రధాన చౌరస్తాలో ఉన్న బీఎల్ గ్రంథాలయం చిక్కడ్‌పల్లిలోని సెంట్రల్ గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. 1962లో ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించగా 1986లో మరమ్మతులు నిర్వహించారు. నగర పొలిమేరలో ఉండటంతో పాటు, ఇక్కడే వివిధ రాష్ట్రాలకు వెళ్లే బస్టాప్ ఉండటంతో అందరూ ఈ గ్రంథాలయంలోనే గంటల తరబడి చదివేవారు. కరోనాకు ముందు పురుషులు 543, మహిళలు 200, పిల్లలు 33 పూర్తిగా 746 మంది సభ్యత్వం ఇక్కడ ఉండేది.

శిథిలావస్థలో..

ఎంతో మందిని తీర్చిదిద్దిన ఈ గ్రంథాలయ ప్రాంతం ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. అయితే 1965లో ఇక్కడ మిలటరీ ఆస్పత్రి నిర్మించే సమయంలో ఇది తమ స్థలమని మిలటరీ వారు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఇక్కడ కట్టడాలు నిర్మించనివ్వమని మిలటరీ అధికారులు తేల్చిచెబుతున్నారు. అయితే గ్రంథాలయం మూసివేసే దిశగా అధికారులు ఇక్కడి నుంచి చాలా పుస్తకాలు ఇప్పటికే తరలించేశారు.

చూస్తూ ఊరుకోం..

లంగర్‌హౌస్‌లోని గ్రంథాలయాన్ని మూసివేయనున్నారని తెలియడంతో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, గోల్కొండ జగదాంబిక ఆలయ చైర్మన్ చంటిబాబు తదితరులు గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి మహేష్‌కు ఫోన్ చేసి గ్రంథాలయాన్ని తరలించొద్దని విన్నవించుకున్నారు. ప్రస్తుతం మరమ్మతులు నిర్వహిద్దామని ఈ సందర్భంగా కోరారు. మూసి వేస్తే ఊరుకునేది లేదని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఇక్కడే గ్రంథాలయాన్ని కొనసాగించాలని వారు కోరారు. సమావేశం అయిన వారిలో బస్తీల పెద్దలు, నాయకులు ఇంద్రసేనారెడ్డి, బీజేపీ లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్, నాగుల పల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాత్రిళ్లు ఇక్కడే ఉండి చదివాం..



ఈ గ్రంథాలయం ప్రారంభించనప్పుడు సభ్యత్వం తీసుకున్న రెండో వ్యక్తిని నేను. మాకు ఇరుకైన ఇళ్లలో కనీసం విద్యుత్ దీపాలు ఉండేవి కావు. 4వ తరగతి నుంచే గ్రంథాలయానికి వచ్చి రాత్రంతా ఇక్కడే చదివి, ఇక్కడే పడుకున్నాం. ఇలా మాకు దారిని, భవిష్యత్తును చూపిన గ్రంథాలయాన్ని మూసివేస్తామంటే చూస్తూ ఊరుకోం.

– నర్సింగ్‌రావు, ఉద్యోగి

ప్రభుత్వం బాధ్యత వహించాలి..



చరిత్ర ఉన్న ఈ గ్రంథాలయంలోనే అనేక మంది ఉన్నత విద్యను అభ్యసించారు. ఇక్కడే గవర్నర్ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు గతంలో నిర్వహించాం. ఇప్పుడు ఆర్మీకి ఈ స్థలాన్ని అప్పగించబోం. ప్రభుత్వం స్పందించి గ్రంథాలయానికి మరమ్మతులు చేయాలి లేదా నూతన భవనాన్ని ఇక్కడే నిర్మించాలి. లేదంటే మేమే నిర్మించుకుంటాం. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలి.

– ఉదయ్‌కుమార్ మాజీ కార్పొరేటర్

బోనాలు సంస్కృతి, సంప్రదాయాలను చాటే పండుగ



బోనాల వేడుకల్లో అధ్యక్షుడు రాంచందర్‌రావు

చాంద్రాయణగుట్ట: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని డివిజన్ల కమిటీ ఆధ్వర్యంలో గురువారం బార్కాస్‌లోని ఏడుగుళ్ల ఆలయంలో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు తలపై బోనంతో వచ్చి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యఅతిథిగా రాంచందర్‌రావు హాజరై మాట్లాడుతూ..పాతబస్తీలో ప్రాచీనమైన ఆలయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, సీనియర్ నాయకులు కొడీ మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, కామాటీ మహేష్, శ్రీనాథ్, మాదరి చంద్రశేఖర్, పొన్న శ్రీనివాసారావు, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'



గుడిమల్కాపూర్ మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నిర్వహణ అధ్వానంగా మారింది. గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌తో పాటు రిటైల్ కూరగాయల షెడ్డు రాష్ట్రంలో అతిపెద్దదైన పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్ కూడా ఇక్కడే ఉన్నాయి. నగర శివారు ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు తెస్తారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి గడ్డ, ఆలుగడ్డ లారీలు సైతం ఈ మార్కెట్‌కే వస్తాయి. పూల రైతులు తాము పండించిన పంటను సైతం పూల మార్కెట్‌కు తెస్తారు. ప్రతినిత్యం రాత్రి 11 నుంచి ఉదయం 10 గంటల వరకు వివిధ రకాల పంటలతో లారీలు, ట్రక్కులు, ఆటో ట్రాలీలు ఈ మార్కెట్‌లోకి వస్తాయి. అసలే ఇరుకైన రోడ్డుపై ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ వస్తుంది. అదే సమయంలో ఉదయం పూట స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, స్కూల్ బస్సులు సైతం ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వరకు ట్రాఫిక్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మెహిదీపట్నం శ్రీ చైతన్య పాఠశాలలో ఇన్వెస్టిచర్ సెర్మనీ

గోల్కొండ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ బి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మెహిదీపట్నం శ్రీచైతన్య పాఠశాలలో నూతనంగా ఎన్నికై న విద్యార్థి నాయకుల ఇన్వెస్టిచర్ సెర్మనీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా ఎన్నికై న విద్యార్థి నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జెబా కతీబ్, ఏజీఎం కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, డీన్ మల్లేష్, కో ఆర్డినేటర్ జనార్దన్, ఇన్‌చార్జి పల్లవి, బాలరాజు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న ఎండీ వేణుగోపాల్‌రావు

యాకుత్‌పురా: 30 ఏళ్లుగా సంస్థకు సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు కొనియాడారు. పురానీ హవేలీలోని సెట్విన్ శిక్షణ సంస్థ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్ రాధాకృష్ణ, అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్ రాజేశ్వరిని గురువారం వేణుగోపాల్‌రావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, ట్రైనింగ్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్, ఉద్యోగులు మహ్మద్ అసిఫ్ అలీ, చంద్రయ్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని యువకుడు(35) హైటెక్‌సిటీ–బోరబండ రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలి రంగుపై తెల్లని గీతలు కలిగిన టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తికి జైలు

జియాగూడ: వెస్ట్‌జోన్‌లోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్న రౌడీషీటర్‌కు గురువారం 4వ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ సత్యనారాయణ 15 రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం ..ఈ నెల 29న రాత్రి సమయంలో గుడిమల్కాపూర్ నాలా వద్ద ఠాకూర్ శంకర్ చేతిలో ఇనుప రాడ్, ముఖానికి ముసుగు ధరించి వ్యక్తిని బెదిరించగా అతను తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టి రౌడీ షీటర్ ఠాకూర్ శంకర్ సింగ్‌గా గుర్తించి పట్టుకున్నామన్నారు. ఇతనిపై ఆసిఫ్‌నగర్, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా ఏడాది పాటు బైండోవర్ కూడా చేశారు. కోర్టుకు రిమాండ్ చేయగా జైలు శిక్షపడింది.

గంజాయి పట్టివేత



గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు

అబిడ్స్: ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఏతో పాటు ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు ధూల్‌పేట్ నుంచి కార్వాన్ రోడ్డు ప్రాంతంలో తనిఖీలు చేపడుతుండగా ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. అమర్‌సింగ్, ధనుంజయ్‌ను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు మరో ఐదు మందిపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాంగ్‌రూట్ ప్రమాదాల నివారణకు చర్యలు



బాపూఘాట్ బ్రిడ్జిపై డివైడర్ ఏర్పాటు చేయిస్తున్న ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

లంగర్‌హౌస్: వాహనాల రాంగ్‌రూట్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి అన్నారు. లంగర్‌హౌస్ సంగం వద్ద ఉన్న బాపూఘాట్ బ్రిడ్జిపై ప్రమాదాల నివారణ కోసం రోడ్డు మధ్యలో బారికేడ్లు, డివైడర్లను గురువారం ఆమె టోలీచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెకటర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి నుంచి వచ్చే వాహనదారులు బాపూఘాట్ వైపు రాంగ్‌రూట్‌లో వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వీరు ఇలా రావడం వల్ల సవ్యంగా వస్తున్న వాహనదారులు తికమక చెందుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం డివైడర్‌లు ఏర్పాటు చేశామన్నారు. అయితే శాశ్వత పరిష్కార దిశగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఆలోచిస్తున్నామన్నారు. టిప్పుఖాన్ బ్రిడ్జి వద్దకు వెళ్లి వాహనాలను యూ టర్న్ చేసుకొని రాకుండా మధ్యలో యూ టర్న్, లేదా సిగ్నల్ వ్యవస్థ గురించి చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

మంత్రి వర్గంలో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి



గాంధీభవన్ ముట్టడికి యత్నించిన గిరిజన విద్యార్థి సంఘం ప్రతినిధులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘంల సంయుక్తాధ్వర్యంలో గురువారం గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వెంకట్ బంజార మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణనలో లంబాడి జనాభాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. లంబాడి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పరిష్కరించాలని లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. గాంధీభవన్ ముట్టడికి యత్నించిన గిరిజన విద్యార్థి సంఘం ప్రతినిధులను పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



ఇమాంపురాలో తహసీల్దార్ జ్యోతి, మధిర సత్యనారాయణ

జియాగూడ: ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆసిఫ్‌నగర్ మండల రెవెన్యూ అధికారి ఎస్.జ్యోతి అన్నారు. ఈ మేరకు గురువారం జియాగూడ ఇమాంపురాలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నవభారత సంఘంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి మాట్లాడుతూ..ప్రతినెలా చివరి రోజున సివిల్ రైట్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మధిర సత్యనారాయణ మాట్లాడుతూ.. బస్తీవాసులకు రేషన్‌కార్డులు అందడం లేదని, ఎస్సీ వర్గీకరణ జరిగినప్పటికీ ఎస్సీ సర్టిఫికెట్లు అందడం లేదని విచారణ చేసిన తరువాతే సర్టిఫికెట్లు ఇవ్వాలని, పెన్షన్ కూడా సకాలంలో అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జస్వంత్‌కుమార్, కోశాధికారి మహేష్‌బాబు, సి.బాబు, జి.మహేందర్, ప్రేమ్‌కుమార్, ఎం.నర్సింగ్‌రావు, మహేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న బేరా బాలకిషన్ తదితరులు

సుల్తాన్‌బజార్: మాల కులస్తులకు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేరా బాలకిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లుడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి జీఓ నెంబర్:99 ద్వారా ఎస్సీలలో 26 కులాలతో గ్రూప్–3గా విభజించారని తెలిపారు. కేవలం 5 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎస్టీ, బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 20 లోపు రోస్టర్ పాయింట్ కేటాయించి మాలలతో పాటు 25 కులాలకు రోస్టర్ 22 కేటాయించి వీరికి రిజర్వేషన్ లేకుండా చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ రిజర్వేషన్లు పూర్తిగా అధ్యాయనం చేసి గ్రూప్:3లో ఉన్న 26 కులాలకు 20 లోపు మిగతా సామాజిక వర్గాలకు కేటాయించిన విధంగా మాలలకు 2 రోస్టర్ పాయింట్లు కేటాయించాలని విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ రాహుల్ రావు, చేపూరి నర్సింహా, ప్రణయ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు అధ్యాపకులు

అబిడ్స్: ఇందిరా ప్రియదర్శిని మహిళా కళాశాలలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులతో పాటు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చంద్రముఖర్జీ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు బోనాల ఉత్సవాలు దోహదపడుతాయన్నారు. ప్రతి సంవత్సరం కళాశాలలోని ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తామన్నారు. విద్యార్థుల్లో సామరస్యం పెంపొంది బోనాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజేంద్రసింగ్, బాలభాస్కర్, భాగ్యవతి, డాక్టర్ ఇ.పావని, బోధనేతర సిబ్బంది అరవింద్, స్వామి, శివాజీ, సురేఖ, రేణుకా సుమిత్ర, ప్రమీళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో కోట బోనాలు విజయవంతం



పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

గోల్కొండ: ప్రజల సహకారంతో గోల్కొండ బోనాలు ప్రశాంతంగా ముగిశాయని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. బోనాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా గోల్కొండ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ కోటలోని నగీనాబాగ్‌లో గేట్ టు గేదర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రత్యేక ప్రణాళికతో బోనాలు జరిగిన తొమ్మిది పూజల్లో కూడా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బల్దియా, జలమండలి, దేవాదాయ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా పని చేశామన్నారు. బోనాలు విజయవంతంగా ముగియడంలో స్థానికుల పాత్రతో పాటు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేంద్రప్రసాద్, మైత్రి కమిటీ సభ్యులు రాజు, నర్సింగ్, నర్సింహ్మా, ఆబేద్, ఇలియాజ్ తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాం



గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని ఆర్గనైజింగ్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం అక్బర్ బాగ్‌లోని టీఎఫ్‌సీఓ ప్రధాన కార్యాలయంలో ఆర్గనైజేషన్ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీఎఫ్‌సీఓ కార్యాకలాపాలను నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లల చదువు కోసం టీఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో త్వరలోనే ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అలీ, ఎంఏ రషీద్, నర్సింగ్‌రావు, దానేశ్వర్, ఉమర్ రహీం, జహంగీర్ తదితరులున్నారు.